# చరిత్ర కాగడా

ఏదేనా సంస్కారం ప్రచారం కావాలంటే అది విజయవంతం కాకూడదంటారు. నే చెప్పదలచుకున్న కథ ఈ సత్యాన్ని ఋజువు చేస్తుందేమో నాకు తెలీదు. అసలు ఈ కథ కూడా ఎలాచెప్పాలో తెలీడంలేదు. ఈ కథలో వ్యక్తులను నే నెరుగను. నేను విన్నవీ, ఇతరుల ద్వారా తెల్సుకున్నవీ సేకరిస్తే, వాటి కూర్పుకి తుదీ మొదలూ, క్రమం - ఏదీ కనబడదు.

నాకు బాగా చిన్నతనం. మా బాబయ్యతో ఆ పెళ్ళికి నేనూ వెళ్ళాను. ఆ రోజుల్లో అది అపూర్వమైన వివాహంగా చెప్పుకున్నారు. వధూవరులిద్దరూ చదువుకున్నవారు, భాగ్యవంతులు, రూపసులు, వొకరినొకరు ప్రేమించుకున్నారు – అన్నిటికంటే ముఖ్యమైనది, వేరు వేరు శాఖలకు చెందినవారు, సనాతనులు, పూర్వాచారపరాయణులు ఆ వివాహాన్ని ఖండించారు. వధూవరుల తల్లిదండ్రుల సమ్మతం లేదు. పెళ్ళికాకుంటే ఆత్మత్యాగం చేసుకుంటామన్న నిశ్చయానికి తలొగ్గి, కొందరు సంస్కర్తలు పట్టుబట్టి, మహావైభవంగా పెద్దల సమక్షాన జరిగిన వివాహం అది. జిల్లా కలెక్టర్, ఆయన భార్య వచ్చి, 'ఈ పెళ్ళి ప్రేమ శక్తిని, విజయాన్ని సూచిస్తుం'దని ఉపన్యసించి, భార్యాభర్తలను ఆశీర్వదించి వెళ్ళారు. పైవూళ్ళనుండి, రాష్ట్రాలనుండి శుభాకాంక్షలు, టెలిగ్రాములు వొచ్చాయి. వందలాదిగా బహుమతులొచ్చాయి. వధూవరుల ఫోటోలు పత్రికలు ప్రచురించాయి. ఒక పత్రికా సంపాదకుడు 'ఆదర్శ వివాహం' అన్న శీర్షికను పెద్ద సంపాదకీయం వ్రాశాడు. ఇవన్నీ ఆనాడు వింతగా చెప్పుకున్నారు. 'ఇవేం పెళ్ళిళ్ళమ్మా - కులగోత్రాలు మంట గలిశాయి' అని చప్పరించి, వేళ్ళు మిటకరించిన అమ్మలక్కలు కార్లో వూరేగుతున్న దంపతులను తలుపు సందుల్లోనుంచి చూచి, అసూయపడి నిట్టూర్చారట.

ఆమె పేరు సీతాకుమారి, అతని పేరు రామారావు. పేర్లుకూడా చక్కగా అమిరాయి అని ఎవరో ఉపన్యసించారు. గ్యాస్‌లైట్లు, కూల్‌డ్రింక్స్, పూలమాలలు, కుంకం, కాగితపు పువ్వులు, సెంట్లు, తమిళ గాయకుని సంగీత కచ్చేరీ, రాత్రి పెళ్ళి వారికి ప్రత్యేక నాటక ప్రదర్శనం – అదొక అపూర్వ ఘట్టం. సీతాకుమారి, పల్చగా, అతి నాజూకుగా వుంటుంది. గ్యాస్‌లైట్ వెలుగులో ఆమె పచ్చటికాంతి తళుక్కుమంది – నవ్వినప్పుడు, ఆకాశంలో బాణసంచా వేసినట్లు, ముఖమంతా తెల్లటి వెలుగుతో మెరిసి, ఆ దృశ్యం గతంలో ఒక మహత్తర అనుభవంగా మధురస్మృతిగా నిలిచిపోతుంది.

రామారావు కూడా చాలా అందమైనవాడు. మన వారిలో పురుషుడి అందం చెప్పుకోరు. 'కుఱ్ఱాడు బాగా ఉంటాడు' అని కూడా అనరు. 'అబ్బాయికేం, అబ్బాయి శుభ్రంగా వుంటాడు' అంటే చాలా అందమైనవాడన్నమాట. అట్లాంటివాళ్ళు కూడా రామారావు 'మొగాళ్ళకే చూడ్డానికి బాగుంటాడండి' అనేవారు. సీతాకుమారి ఎంత గాఢంగా ప్రేమించిందో, ఆనాటి సమాజంలో పెద్దలెవ్వరూ వూహించలేరనొచ్చు.

అంతటి గాఢమైన ప్రేమ, అనుకూల దాంపత్యం చూసి దేవతలు వోర్చలేరంటాను. 'ఈ పెళ్ళి ఆరునెలలు నిలబడితే గొప్ప' అని అంచనా వేసిన పెద్దలు, రెండేళ్ళ తర్వాత వారి అన్యోన్యాన్ని చూసి ముక్కుమీద వేలేసుకున్నారు. 'ఐదేళ్ళు దాటదండి' అని మరో మూడేళ్ళు గడువిచ్చారు. ఈ మూడేళ్ళలోనూ ఏదో అవాంతరం సంభవించి ఆ వివాహం భగ్నం కాకపోతుందా అన్న ధైర్యంతో.

ఐదేళ్ళ తర్వాత, మళ్ళా వాళ్ళ దాంపత్యం గురించి విన్నాను. ఆమె నొకసారి నాటకం హాల్లో ముందు సీట్లో చూశాను. ప్రేమకి విద్య, భాగ్యం, సౌందర్యం తోడైతే యింకేం కావాలి? జనం అంతా నాటకం ఒదిలేసి వారికేసి చూడడమే సరిపోయింది. ఆమెకట్టిన ఖరీదైన చీర, రవ్వల దుద్దులు, నెక్లెస్, అతని సూటు, వాచ్, అవన్నీ చూస్తే వారి భాగ్యం చాలావరకు వేషధారణకే వినియోగమౌతోందనుకోవాలి. వారిని బాగా ఎరిగున్న స్నేహితుడొకాయన మా బాబయ్యతో చెబుతుంటే విన్నాను. ఆమె ఏది కోరితే అది యిస్తాడుట. చీరల కోసం మైసూరు, కంచి, ఆగ్రా, పూనా వెళ్ళేవారట. హాయిగా చదువుకుంటారట. చీట్లాడుతారట, షికార్లెడతారుట. స్నేహితులు, పిక్నిక్‌లు పార్టీలు, యాత్రలు - నిశ్చింతగా సాగిపోతున్న జీవితం వారిది.

సనాతనుల నోళ్ళు నెప్పెట్టి, ఈ దంపతుల వూసెత్తడం మానుకున్నారు. ఈ లోగా బోలెడన్ని వర్ణాంతర వివాహాలు, విధవా వివాహాలు, లేచిపోయిన వారి వివాహాలు జరిగాయి. వీరంతా వెళ్ళి ఆ కొత్త దంపతుల మీద పడ్డారు. ఆచార భారంతో పండిన వారి తలలు బ్రద్దలు కొట్టుకునేందుకు ఏదో గట్టి వస్తువు దొరకాలిగా మరి?

మరో ఐదేళ్ళు జరిగిపొయ్యాయి. నేను రామారావు, సీతాకుమారి ఉన్న వూళ్ళో వుండటం తటస్థించింది. ఆమెను చూళ్లేదు కాని, రామారావుని ఒకటి రెండు సార్లు పార్కులో చూశాను. వారిని గురించి మా చాకలి 'సందెయ్య' చెబుతుంటాడు. వాళ్ళింట్లో బట్టలు కూడా సందెయ్యే ఉతుకుతాడు. వారి జీవిత భోగట్టా వాడు బాగా పరిశీలించి తెలుసుకున్నాడు.

"వారు సుఖంగా, సంతోషంగా వుంటారు కదట్రా?"

"ఏం సుఖంలెండి, ఆమె ఎప్పుడూ విసుక్కుంటమే. ఆయన ఎప్పుడూ చీదరించుకుంటమే."

"ఎందుకు?"

"ఏమోనండి. ఆవిడ బట్టలన్నీ పాతబడిపోయినాయి. కొత్తవి కొనరంట - ఎక్కడికీ తీసుకెళ్ళరంట."

"ఆయన తీసికెళ్ళేదేమిటి? ఆవిడకు బోలెడు డబ్బుందిగా!"

"అదంతా అయిపోయిందండి. అయ్యగారికి భలే జాగ్రత్త; కానీ పోనివ్వరు. ఇంకా ఈసుబేకుని అడగండి" అన్నాడు సందెయ్య.

తరువాత ఈసుబేగ్‌తో మాట్లాడడం తటస్థించింది. అతను వృద్ధుడు. మొదటి ప్రపంచ సంగ్రామంలో పనిచేసి రిటైరై ఏమీ పనిలేకుండా వుంటున్నాడు. దేశవిభజన జరిగిన తర్వాత, ఉత్తర హిందూస్థానం నుండి వొచ్చిన కాందిశీకుల గుంపులోంచి

విడిపోయిన 'ఆయేషా' అనే అనాథ కన్యను చేరదీసి పోషిస్తున్నాడు. ఆమె తనని తండ్రిగా చూసుకుని సపర్యలుచేస్తూ వుంటుంది. రామారావు ఒకసారి భార్యమీద ఓ పుస్తకం గిరవాటెట్టాడని - అది స్వయంగా చూశానని చెప్పాడు. వారి సంభాషణ వల్ల తేలిందేమంటే, వారి డబ్బంతా అయిపోయిందనీ, రామారావు పీనాసిగా తయారై, భార్యని హింసిస్తున్నాడనీ, వారి ఆదర్శ వివాహంలో ఏ ఆదర్శమూ లేదనీ విశదమైంది.

ఒక నెల జరిగిం తర్వాత, ఈసుబేగ్ చనిపొయ్యాడు. గుండె పగిలి చనిపొయ్యాడంటాడు, చాకలి సందెయ్య.

"ఎందుకు?"

"రహస్యం లెగండి ఎవరితోనూ అనబోకండి. ఒకరోజు రామారావుగారు ఆయేషా మొఖం మీద చెయ్యేసి పట్టుగుంటం, ఈసుబేగ్ చూశాడంటండి. నాతో చెప్పాడు. నా గుండి చెదిరిపోయిందిరా అన్నాడండి. ఆ దెబ్బతో మంచానపడి సచ్చాడండి."

రామారావుకి సీతాకుమారికీ మానసికంగా కాకుండా శారీరకంగా కూడా యింతటి ఎడబాటు జరిగింది. కారణం? వయస్సుతోపాటు ఆదర్శం యొక్క ఆంతర్యం మారుతుండడమేమో ననిపిస్తుంది. మానసికంగా ఎడబాటు జరిగింతర్వాత, మనోవ్యాధి నుంచి పారిపొయ్యేటందుకు 'ఆయేషా' కావల్సి వచ్చిందేమో! సీతాకుమారి చాలాకాలం వాళ్ళ ఊళ్ళోనే వుంటోంది - ఎప్పుడో కాని భర్త దగ్గర వుండదు. ఈ మధ్యనే మరో వార్త విన్నాను. రామారావు ఆస్తంతా కాందిశీకుల వసతి భవనాల నిధికి రాసేసి ఉత్తర హిందూస్థానం వెళ్ళి ఆర్మీలో ఉపాధ్యాయుడులా చేరాడని.

"ఆవిడగారిక్కూడా కొంత యిచ్చి వెళ్ళాడటలెండి - అసలు సున్నా చుట్టకుండా." అన్నాడు సందెయ్య.

"ఆయేషా?" అని అడిగాను.

'ఆమె యిక్కడే వుందండి. ఆళ్ళందరికీ కొత్తిళ్ళు కడుతుండారండి. అక్కడపోయి, ఏదోపన్లో చేరుతుందంటండి.'

'రామారావు ఆమెని తనతో ఎందుకు తీసికెళ్ళలేదు?'

'నేను నిలేసి అడిగానండి ఆ పిల్లని. అదంతా వొట్టిదంటండి. ఊరికే దాని గడ్డం పట్టుకుని, కళ్ళల్లోకి దిగాలుగా చూశారంటండి. అంతకి మించి ఏమీ చెయ్యలేదని ప్రమాణంచేసి చెప్పిందండి. అదిమట్టుకు అబద్ధం ఆడదండి' అని ముగించాడు సందెయ్య.

చరిత్ర చీకటి గుహలలో కాగడావేసి చూసినట్లు రామారావు, ఆయేషా అమాయకపు కళ్ళల్లోకి చూసి, తనహృదయంలో నిండుకున్న ఏకాంతాన్ని, విషాదాన్ని ఆమె చూపులో స్పృశించి, ఆదర్శాల ఐక్యత, మానసిక సమత్వం, సంతృప్తి పొందాడు. అతను పీనాసిగా వుండిపోతు చేసిన సర్వస్వమూ, సత్కార్యానికి, లోకకళ్యాణానికి దానం చేసేశాడు. భార్యవద్ద నుండి దాచిన యేకాంత మాధుర్యాన్ని ప్రపంచానికి ఖర్చుపెట్టేశాడు. తను మానసిక స్వాతంత్ర్యం కోరి, భార్యకి ఆ స్వాతంత్ర్యం యిచ్చేశాడు. ఆమెను సోమరిగా వొదిలేసి, తను ఆర్మీలో చేరాడు. అంచేత సంస్కారం ప్రచారం కావాలంటే, అది పూర్తిగా కొనసాగకూడదన్నారు.